ప్రజాశక్తి
గురువారం 6 జులై 2023
5
అనంతపురం

మధుపై వేటు

చామలూరు రాజగోపాల్‌కు షోకాజ్ నోటీసులు

వైసిపిలో ఎన్నికలకు ముందు ప్రక్షాళన మొదలైందా. ?



మధు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సోదరుడు వై.మధుసూదన్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వైసిపి జిల్లా కన్వీనర్ పైలా నరసింహయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలి భర్త, మాజీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి చామలూరు రాజగోపాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళారం నాడు హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగానున్న మహమ్మద్ ఇక్బాల్ స్థానంలో దీపికారెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం రోజు మరో ఇద్దరిపై పార్టీ చర్యలకు సిద్ధపడటం చర్చనీయాంశమవుతోంది. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు ప్రణయ్‌పై గత కొన్ని రోజులుగా భూ అక్రమాణ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని బలపరుస్తూ భూ అక్రమాల్లో వైసిపి నాయకుల ప్రమేయం ఉందంటూ గతనెల 29వ తేదీన మధుసూదన్ రెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీ నాయకులపై ఇటువంటి వ్యాఖ్యలు చేయడాన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఆరోపణలు చేసిన మధుసూదన్‌రెడ్డిపై వేటువేస్తూ నిర్ణయం చేసింది. అదే సందర్భంలో ఏప్రిల్ నెలలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన నార్పలలో జరిగిన సమయంలో ఆయన్ను కలువకుండా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆయన భర్త విద్యాశాఖ సలహాదారు సాంబశివారెడ్డి అడ్డుకున్నారంటూ చామలూరు రాజగోపాల్ ఆరోపించారు. దీనిపైనా వివరణ కోరుతూ ఆయనకు జిల్లా కన్వీనర్ పైలా నరసింహయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వైసిపి ప్రక్షాళన మొదలు పెట్టిందా.?

2024 సార్వత్రిక ఎన్నికలు సమీస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలో గ్రూపు తగాదాలు పెరుగుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో నేతల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని గత నెలలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య నేతలతో విడివిడిగా సమావేశమై వివరాలు సేకరించారు. దీని ఫాలోఆప్‌గానే గత వారంలో తిరుపతిలో నియోజకవర్గ ఎమ్మెల్యేలతోనూ విడివిడిగా సమావేశమై సర్వే రిపోర్టులు, నియోజకవర్గాల్లో నేతల పనితీరు అన్నింటిపైనా చర్చించారు. అనంతరం వరుసగా పార్టీలో మార్పులు, చేర్పులు చేపట్టడం ప్రారంభమైనట్టు కనిపిస్తోంది. హిందూపురం మార్పు జరిగిన మరుసటి రోజే మరో ఇద్దరిపై చర్యలకు ఉపక్రమించడం చర్చనీయాంశమైంది. వివాదాలున్న మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే తీరున చర్యలుంటాయా అన్నది కూడా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికల సమయం వచ్చే సరికి వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టే ఆలోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా ఇటువంటి చర్యలు తప్పవన్న హెచ్చరికను సైతం జిల్లా కన్వీనర్ పైలా నరసింహయ్య జారీ చేసిన ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. దీన్ని బట్టి పార్టీకి వ్యతిరేకంగా బాహాటంగా ఎవరు మాట్లాడినా వేటు పడటం ఖాయమన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

టమోటా మండీలు వెలవెల..!

- జిల్లాలో తగ్గిన సాగు
- గతంలో మార్కెట్‌కు వెయ్యి టన్నుల వరకు వచ్చేవి..
- ఇప్పుడు ఒక టన్ను కూడా బరువే..!
- దిగుబడల్లేక నింగినంటిన ధర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో మదనపల్లి టమోటా మార్కెట్ తరువాత అనంతపురం మార్కెట్ అతిపెద్దది. సీజన్‌లో రోజుకు మూడు నుంచి నాలుగైదు టన్నుల వరకు టమోటా ఇక్కడికి వచ్చేది. అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి పంచాయతీ పరిధిలో ఈ టమోటా మండీలు పెద్దఎత్తున ఉన్నాయి. 30 మండీల వరకు ఇక్కడ ఉన్నాయి. వీటి సీజన్ అయిన జూన్ నుంచి ఫిబ్రవరి వరకు టమోటా పంట ఇక్కడికి వస్తూ ఉంటుంది. ఇక్కడి నుంచి రాష్ట్రంలో స్థానిక మార్కెట్‌లతోపాటు అటు కర్నాటక, ఉత్తరాదిలో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వరకు అనంతపురం నుంచి లారీల్లో టమోటా వెలుతూ ఉంటుంది. ఈసారి సీజన్ ప్రారంభమైనా మార్కెట్‌కు సరుకు రావడం లేదు. దీంతో అనంతపురంలోని టమోటా మార్కెట్‌లు సరుకు లేక వెలవెలపోతున్నాయి.

రైతులు, వ్యాపారులు లేక ఖాళీగా ఉన్న అనంతపురంలోని టమోటా మండీ

వాతావరణ ప్రభావం...గిట్టుబాటు ధర లేక..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల వరకు టమోటా పంట సాగవుతుంది. చిత్తూరు తరువాత అత్యధికంగా ఇక్కడే ఈ పంట సాగవుతుంది. వేసవిలో ఇక్కడ ఎండలు అధికంగానున్న సమయంలో ఈ పంట దిగుబడులు సరిగా రావు. దీంతో ఏప్రిల్, మే మసాల్లో ఇక్కడ పంట ఉండదు. ఎండలు తగ్గే సమయానికి అంటే జూన్ నాటికి పంట వచ్చే విధంగా రైతులు బోరు బావుల కింద పంటలు సాగు చేస్తారు. గతేడాది వాతావరణ ప్రభావంతో రైతులు పెద్దఎత్తున పంట నష్టపోయారు. అటు వర్షాలు, ఇటు ఎండలు రెండింటి మూలంగా దెబ్బతినడమే కాకుండా ధర కూడా ఏ ఒక్క దశలో గిట్టుబాటు లభించలేదు. దీంతో మేలో సాగు చేయాలనుకున్న రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో దిగుబడులు జూన్ నాటికి రావాల్సినవి తగినంత రాలేదు. జూన్ నాటికే టమోటా మండీలు తెరచుకున్నప్పటికీ పంట స్థానికంగా లేకపోవడంతో ఇప్పటికీ సరుకు లేక మండీలు వెలవెలబోతున్నాయి. వెయ్యి టన్నుల వరకు ఈ సమయానికి పంట వచ్చేది ఇప్పుడు అది వచ్చే పరిస్థితి లేదు. పంట లేకపోవడంతో టమోటా ధర సైతం కిలో వంద రూపాయలకు చేరింది.

వాతావరణ ప్రభావం ఉంది ..

ఈసారి ఏప్రిల్, మే మాసాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంది. మేలోనూ ఈ తీవ్రత కొనసాడంతో పంటల సాగుపై ప్రభావం పడింది. మేలో పెద్దగా టమోటా పంట జిల్లాలో సాగవలేదు. ఇప్పుడిప్పుడు సాగు జరుగుతోంది. ప్రస్తుతం ఎనిమిది వేల ఎకరాలకుపైగా సాగైంది. ఈ పంట వచ్చే మాసానికి దిగుబడులు వచ్చే అవకాశముంది. ఎండ తీవ్రత తగ్గుతున్న కొద్దీ పంట వస్తుంది. కాబట్టి వచ్చే రెండు మాసాల్లో టమోటా పంట వస్తే ధరల్లో స్థిరత్వం వచ్చే అవకాశాలున్నాయి.

రఘునాథరెడ్డి, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్.

రోజుకు 50 వేల బాక్సులొచ్చేవి...

అనంతపురం టమోటా మార్కెట్‌కు సాధారణంగా ఈ సమయానికి రోజుకు 50 వేల బాక్సులైనా టమోటా వచ్చేది. ఈసారి వెయ్యి, రెండు వేలు కూడా రావడం లేదు. వాతావరణ ప్రభావంతో రైతులు మేలో పంట సాగు చేయలేకపోయారు. దీంతో సీజన్‌లో రావాల్సిన టమోటా పంట దిగుబడి రాలేదు. ఈ ప్రభావం ధరలపైనా పడుతోంది. బయట కర్నాటకలో కొంత ఉన్నప్పటికీ స్థానిక మార్కెట్‌లకే అది సరిపోతోంది. ఇక్కడికి రావడం లేదు.

నజీర్, టమోటా వ్యాపారి.

ప్రభుత్వాలకు సరైన ప్రణాళిక లేకనే...

పంటల సాగు, దిగుబడులు, వాటికి గిట్టుబాటు ధర కల్పించడంపై ప్రభుత్వాలకు సరైన ప్రణాళిక లేకపోవడంతోనే ఈ సమస్య వస్తోంది. గతేడాది పంటలు సాగు చేసిన రైతులకు సరైన గిట్టుబాటు ధరలేదు. ప్రకృతి వైపరిత్యాలతో నష్టపోతే పరిహారమూ సక్రమంగా అందివ్వలేదు. అందుకే ప్రభుత్వాలు ధర స్థిరీకరణపై దృష్టి సారించాల్సిన అవసరముంది. డిమాండ్‌కు తగ్గట్టు మార్కెట్‌లో పంట దిగుబడులుండే విధంగా ప్రణాళిక ఉంటే ఈ సమస్య ఉండదు.

చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

రాజకీయ ఒత్తిళ్లతోనే సిఐ ఆత్మహత్య

మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాజకీయ ఒత్తిళ్లతోనే తాడిపత్రి సిఐ ఆనందరావు ఆత్మహత్యకు పాల్పడినట్టు మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసిపి నాయకుల ఒత్తిళ్లతోనే సిఐ ఆనందరావు ఆత్మహత్య చేసుకుని చనిపోయారన్నారు. దీనికి సాక్షాలూ ఉన్నాయన్నారు. వైసిపి నాయకులు ఫయాజ్ బాషాపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదవ్వాల్సి ఉందని తెలిపారు. ఈ కేసు ఆయనపై నమోదు చేయకూడదని సిఐపై ఒత్తిడి తెచ్చారన్నారు. న్యాయస్థానం నుంచి ఆదేశాలొచ్చినా దాన్ని అమలు చేయడకూడదని ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రోజు మధ్యాహ్నం డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి ఒత్తిడి చేసారని జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. డీఎస్పీ కార్యాలయానికి ఫయాజ్ బాషా వెళ్లిన పోటోలూ ఉన్నాయన్నారు. అక్కడి నుంచి ఇంటికెళ్లిన తరువాత నుంచి ఆయన బయటకు రాలేదని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోటి రూపాయలు పరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. సిఐ ఆత్మహత్యపై పోలీసు అధికారుల సంఘం సైతం స్పందించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న శ్రీ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చలు విఫలం

మోటార్లు నిలిపేసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా శ్రీ సత్యసాయి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులతో చేపట్టిన చర్చలు విఫలం అయ్యాయి. బుధవారం నాడు శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో తెల్లవారు జామున పంపుమోటార్లు నిలిపి వేసి నిరసన చేట్టారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు నేతృత్వంలోని కమిటీ నాయకులతో శ్రీసత్యసాయి బోర్డ్ కార్యాలయంలో చర్చలు నిర్వహించారు. యూనియన్ నేతలు గతంలో సమ్మె చేపట్టిన సమయంలో ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదని నిరసన తెలిపారు. చర్చల సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీసత్యసాయి తాగునీటి కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు ఓబులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రామారావుకు పలు సమస్యలు వివరించారు. 3 నెలల వేతనాలు, 11 నెలల పియఫ్,14 నెలల ఇఎస్ఐ, బోనస్, లీవ్ ఇన్ క్యాష్‌మెంట్, బకాయి చెల్లించాలన్నారు. ఇదివరకే 8 నెలల సమ్మె సందర్భంగా ఒప్పందం ఇచ్చినప్పటికీ అమలుకాలేదన్నారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి వాటర్ సప్లై బోర్డ్ మెంబర్ సెక్రటరీ మాట్లాడుతూ ఒక నెల వేతనం చెల్లిస్తామని, మిగిలిన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్మికులు సమ్మె కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. దీనిపై కార్మిక యూనియన్ నాయకులు సమావేశమై, సమ్మె కొనసాగిస్తామనే అభిప్రాయం అధికారులకు తెలిపారు. అనంతరం బోర్డ్ ఆఫీస్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓబులు, జిల్లా కార్యదర్శి నాగేంద్ర, తిప్పేస్వామి మాట్లాడుతూ పని చేసిన దానికి కూలి ఇవ్వమని అడిగితే చెల్లించాల్సిందిపోయి కార్మికులను భయపెట్టే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. సమస్య పరిస్కారం అయ్యే వరకు విధుల్లోకి వెల్లరన్నారు. జీతాలు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావంతో నిరసన చేస్తున్న నేపథ్యంలో అధికారులు ఎంత మేరకు పరిస్కారానికి చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి కార్మికుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, మధు, రవిచారి, లక్ష్మిరెడ్డి, నబీరసూల్, వవన్నారుస్వామి, మహానంది, డివైఎఫ్ఐ నాయకులు రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి - జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ఈ నెల 8న కళ్యాణదుర్గంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్‌తో కలిసి బుధవారం నాడు ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుమునుపు బహిరంగసభ వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, వై.శివరామిరెడ్డి, మంగమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు అధికారులు సమిష్టిగా కషి చేయాలని తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ ఆయా శాఖల పరిధిలో పూర్తి చేయాలన్నారు. కలెక్టర్,ఎస్పీల ద్వారా జారీ చేసిన ఆదేశాలు, అప్పగించిన పనులను అధికారులు బాధ్యతయుతంగా పూర్తి చేయాలని సూచించారు. సభకు హాజరవుతున్న అతిథులు, రైతులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్, పార్కింగ్, పారిశుధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా, బ్యారికెడ్స్ ఏర్పాటు, బహిరంగ సభ వేదిక, తాగునీటి సరఫరా, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం, ప్రోటోకాల్ తదితర అంశాలపై దృష్టిని సారించాలన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరూ కూడా సమిష్టి బాధ్యతగా తీసుకొని ముఖ్యమంత్రి సభను విజయయంతం చేయాలని కోరారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని అధికారులు సమిష్టి కృషితో విజయవంతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఉన్న అన్ని పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 2022 ఇన్సూరెన్స్‌ను ఈ నెల 8వ తేదీన రైతుల ఖాతాల్లోకి జమ చేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1016 కోట్లను బటన్ నొక్కి రైతుల ఖాతాలోకి జమ చేస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన 52 అగ్రి ల్యాబ్‌లను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ హమ్మద్, మైనార్టీ నాయకులు తాడిపత్రి ఫయాజ్ బాషా, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వివరిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, కలెక్టర్ ఎం.గౌతమి

పూర్వ విద్యార్థుల పాత్ర అమోఘం

జెఎన్‌టియు విసి రంగజనార్థన

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థులతో జెఎన్‌టియు విసి రంగజనార్థన్

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర అమోఘం అని విసి రంగజనార్థన పేర్కొన్నారు. 1970వ సంవత్సరం జెఎన్‌టియు పూర్వ విద్యార్థి పి.శంకర నారాయణ వర్సిటీ అధికారులతో బుధవారం నాడు సమావేశం అయ్యారు. వర్సిటీ అభివృద్ధికి తనవంతు సహకారం అందించేందుకు ఆయన అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా విసి రాబోవు కాలంలో పూర్వ విద్యార్థుల సహకారంతో జెఎన్‌టియు కళాశాలను మరింత అబివద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. ఈ నెల 7వ తేదీన కళాశాల యాన్యువల్ అల్యూమిని మీట్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మీట్‌కు పూర్వ విద్యార్థులందరూ రావాలని విసి కోరారు. నెల్లూరు జిల్లాకు చెందిన జెఎన్‌టియు పూర్వ విద్యార్థి పి.శంకర నారాయణ అమెరికాలో స్థిరపడ్డారని, ఆయన కళాశాల అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ , ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, వి.సుమలత, అనంతపురం జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, కళాశాల పూర్వ విద్యార్థి వి.శంకర్, డాక్టర్ కళ్యాణిరాధ, డాక్టర్ ఎం.రామశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అండర్-18 బాస్కెట్‌బాల్ పోటీల్లో కీర్తన సత్తా

బుక్కరాయసముద్రం : రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో బుక్కరాయసముద్రం విద్యార్థులు సత్తా చాటారని హెచ్ఎం వసుంధర బుధవారం తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల అండర్-18 బాస్కెట్‌బాల్ టోర్నీలో బి.కీర్తన(10వ తరగతి) జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానం సాధించడానికి కృషి చేసిందని పిఇటి గోపాల్ రెడ్డి తెలిపారు. కీర్తనకు హెచ్ఎం మెడల్ బహూకరించి వాటర్ బాటిల్‌ను బహుమతిగా అందించి అభినందించారు.

వందశాతం లక్ష్యాన్ని చేరుకుందాం

జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆ మేరకు జిల్లాలో వంద శాతం గృహ నిర్మాణాల పనులను పూర్తి చేయించే దిశగా గృహ నిర్మాణ శాఖ అధికారులు పని చేయాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అనంతపురం అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కనీస మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైనది ఇల్లు అన్నారు. అలాంటి ఇళ్ల నిర్మాణాలు చేయించే విధుల్లో ఉన్న హౌసింగ్ ఉద్యోగుల సేవలు అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేసి, కట్టించి ఇవ్వడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దీనికి అనుగుణంగానే గహ నిర్మాణ శాఖ అధికారులు సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని చెప్పారు. జులై మాసం చివరిలోపు అనంతపురం జిల్లాలో 20 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంలో భాగంగా ఇప్పటికే 16 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం శుభపరిణామం అన్నారు. మిగిలిన ఇళ్లను కూడా అనుకున్న సమయంలోపు పూర్తి చేయించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతరం గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేశవ నాయుడు, ఈఈ సత్యనారాయణ, మేనేజర్ మద్దయ్య, డీఈలు కష్ణారావు శ్రీమన్నారాయణ, లక్ష్మీనారాయణమ్మ, శైలజ, ఏఈ కొండభూషణ్, అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్ హుస్సేన్, హౌసింగ్ శాఖ ఏఈలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ చేతుల్లో మీడియా

- సామాజిక స్పృహ కలిగిన పాత్రికేయులు రావాలి
- సుసర్ల రమేష్ సన్మాన సభలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో నాల్గవ స్తభంగా కొలిచే మీడియా రంగం పెట్టుబడిదారీ వ్యవస్థ కబంధ హస్తాల్లో చేరడం వల్ల సమాజానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు వక్తలు తెలిపారు. హిందూపత్రిక పాత్రికేయుడిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన సుసర్ల రమేష్‌కు బుధవారం నాడు విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవో హోంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజీ.రాజమోహన్ అధ్యక్షతన జర్నలిజం- సామాజిక బాధ్యతపై మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ మీడియా సేవలపై ప్రతి ఒక్కరికి ఆసక్తి ఉందన్నారు. సాంకేతికంగా అభివృద్ధి సాధించిన నేపథ్యంలో మీడియా రంగం కొలమానం లేని విధంగా వ్యాప్తి చెందిందన్నారు. ప్రస్తుతం వాస్తవాల కంటే నెగిటివ్ ఆలోచనలు రేకెత్తించేలా మీడియా వ్యవస్థ తయారు కావడం బాధకారం అన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి మీడియా రంగానికి ఉందన్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడే ప్రభుత్వాలు ఉంటే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజీ.రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అన్యాయాన్ని నిలదీసి సక్రమంగా వ్యవస్థలను నడిపే శక్తి మీడియాకు ఉందన్నారు. డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ సమాజంలో ప్రజల పక్షాన మీడియా ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ సమాజాన్ని తట్టి లేపే శక్తి జర్నలిజంకు ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మీడియాలో కూడా మార్పులు వచ్చాయని తెలిపారు. సమాజాభివృద్ధిని కాంక్షించే పాత్రికేయులు ఎందరో ఉన్నారని, అలాంటి వారిలో రమేష్ నిలిచారన్నారు. రాయలసీమ వెనుకబాటుపై, పేదరికం, కార్మికుల శ్రమ దోపిడిని ఎత్తి చూపుతూ అనేక కథనాలు రాశారని అభినందించారు. బిజెపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మీడియా పెట్టుబడి దారీ చేతుల్లోకి వెళ్లిందని, ఆయా సంస్థలు లాభాపేక్ష కోసమే పని చేస్తాయనడంలో సందేహం లేదన్నారు. సన్మాన గ్రహీత సుసర్ల రమేష్ మాట్లాడుతూ తాను పని చేసిన కాలంలో జిల్లాలో అనేక సమస్యలపై కథనాలు రాశానని, వాటిలో కొన్ని పరిష్కారం జరిగిందన్నారు. సామాజిక దృక్పథంతోనే ప్రస్తుతం పాత్రికేయులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం జిల్లా నాయకులు ఎంఎన్‌టి.రాజు, శ్రీనివాసరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జిలాన్, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, సురేంద్ర, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, రామాంజినేయులు, సురేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్యచంద్రయాదవ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుసర్ల రమేష్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

ఆర్ట్స్ కళాశాలకు జాతీయ ర్యాంకులు

అనంతపురం : ఇండియా టుడే మ్యాగజైన్ నిర్వహించిన సర్వేలో నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించింది. బి.ఎస్సీ విభాగంలో 118, ఆర్ట్స్ విభాగంలో 140, కామర్స్ విభాగంలో 200వ స్థానాలను సాధించింది. దీంతో ప్రిన్సిపల్ డా. దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

In the Court of the IInd Addl. Junior Civil Judge (Mobile Court): Ananthapuramu

O.S.No.322/2021

Between:
Andhra Pragathi Grameena Bank, rep by its Chief Manager, P.T.C. Branch, Anantapuramu. ...Plaintiff

And

1.B.M. Venkatesu
2.K.Sreenivasa Rao ...Defendants

NOTICE TO D1

To,
B.M. Venkatesu S/o Bogeswar Rao, D.No.16/651-A-403, Bhagya Nagar, Anantapuramu Town.

పై దావా నందు వాది బ్యాంకుకు రావాల్సిన బాకీ మొత్తము రాబట్టు కొనుటకై ప్రతివాదుల పైన దావా దాఖలు చేసియున్నారు. కావున మొదటి ప్రతివాది అయిన మీకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు తేది:25-07-2023 న హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించుదురని తెలుపడమైనది. **(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)**

వాయిదా:25-07-2023.

B.NAGALINGAM, M.A., B.L.
Advocate, Ananthapuramu,
Cell:9440759948.

In the Court of the Ist Addl. Junior Civil Judge: Ananthapuramu

O.S.No.259/2020

Between:
Andhra Pragathi Grameena Bank, rep by its Chief Manager, Maruthi Nagar Branch, Anantapuramu. ...Plaintiff

And

G.Vani ...Defendant

NOTICE TO DEFENDANT

To,
G.Vani W/o Ganesh, D.No.14/113, Mandla Subba Reddy Nagar, Anantapuramu.

పై దావా నందు వాది బ్యాంకుకు రావాల్సిన బాకీ మొత్తము రాబట్టు కొనుటకై ప్రతివాది పైన దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు తేది:20-07-2023న హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించుదురని తెలుపడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా:20-07-2023.

B.NAGALINGAM, M.A., B.L.
Advocate, Ananthapuramu,
Cell:9440759948.

In the Court of the Hon'ble Prinicipal District Judge: Ananthapuramu

(In the matter of appointment of the Guardian for permission for sale of 3/4th share in immovable property of the minors 1.B.Venu Kumar 2.B.Kajal and 3.B.Sneha.)

G.O.P.No.48/2023

Between:
Burula Aruna. ...Petitioner

And

NIL ...Respondent

NOTICE

పై దావా నందలి అర్జీదారు తన మైనరు బిడ్డలకు 3/4 వంతు హక్కు కలిగిన షెడ్యూలు దాఖలా ఆస్తిని మైనర్ల తరవున విక్రయించుటకు గాను పై కోర్టువారి అనుమతి కోరుతూ దావా దాఖలు చేసియున్నారు. ఈ విషయమై ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు ఉన్న 24-07-2023 వ తేది ఉదయం 10.30 గం॥ని॥లకు పై కోర్టు నందు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలియజేసుకొనవచ్చును.

షెడ్యూలు:

అనంతపురం ఆర్.డి. మరియు గుంతకల్లు ఎస్.ఆర్.డి. తిమ్మనచెర్ల పొలం, డోర్ నెం.517 వద్ద ఉన్న 50.4 చ॥మీ॥ బయలు స్థలము. ప్రస్తుతం వార్డు నెం.12, కొత్తవార్డు నెం.10

చెక్కుబంది: తూర్పు: సనావుల్లా ఖాన్ ప్లాట్ నెం.63, **పడమర:** కె.లక్ష్మినారాయణ ప్లాట్ నెం.62, **ఉత్తరం:** 33 అడుగుల రోడ్డు, **దక్షిణం:** మునెప్ప ప్లాటు నెం.62. **తూర్పు-పడమర:** 18 అడుగులు, **ఉత్తర-దక్షిణం:** 30 అడుగులు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

S.ABDUL RASOOL
B.SATHYA NARAYANA
Advocates, Anantapuramu.

In the Court of the IInd Addl. Junior Civil Judge (Mobile Court): Ananthapuramu

O.S.No.1331/2022

Between:
Andhra Pragathi Grameena Bank, rep by its Senior Manager, Sai Junior College Branch, Anantapuramu. ...Plaintiff

And

1.C.Madhu Konda Reddy
2.Uppara Adinarayana ...Defendants

NOTICE TO Ist & IInd DEFENDANTS

To,
1.C.Madhu Konda Reddy S/o C.Sudhakar Reddy, D.No.5-49-F, Chinmaya Nagar, Rapthadu Mandal, Anantapuramu District.
2.Uppara Adinarayana S/o U.Ayyappa, D.No.4-155, Chinmaya Nagar, Rapthadu Mandal, Anantapuramu District.

పై దావా నందు వాది బ్యాంకుకు రావాల్సిన బాకీ మొత్తము రాబట్టు కొనుటకై ప్రతివాదుల పైన దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాదులు అయిన మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు తేది:18-07-2023 న హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షమున దావా తీర్మానించుదురని తెలుపడమైనది. **(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)**

వాయిదా:18-07-2023.

B.NAGALINGAM, M.A., B.L.
Advocate, Ananthapuramu,
Cell:9440759948.

In the Court of the Hon'ble IIIrd Addl. Junior Civil Judge (Spl Pro & Excise Court Judge): Ananthapuramu

I.A.NO.196/2020 in O.S.No.979/2019

Between:
Jogi Reddy Vijaya Bhaskar Reddy ...Petitioner/Plaintiff

And

1.B.Someswari Reddy died by L.Rs
2.B.Radha Rani (R2)
3.B.Sirisha (R3)
4.B.Prasanthi (R4)
...Respondents/Proposed Parties

NOTICE TO RESPONDENT/PROPOSED PARTIES NO.R2, R3, R4

1.Smt. B.Radha Rani W/o Late B.Someswar Reddy (R2), D.No.12-3-67, Sai Nagar, Anantapuram.
2.B.Sirisha D/o Late B.Someswar Reddy (R3), D.No.12-3-67, Sai Nagar, Anantapuramu.
3.B.Prasanthi D/o Late B.Someswar Reddy, D.No.8/400, Opp:Andhra Praghathi Grameena Bank, Narpala(Vi) & (M), Anantapuramu (Dist.)

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ప్రతివాదులు హాజరు నిమిత్తం పై కోర్టు నందు 27-07-2023వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10.30 గం॥లకు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

L.Prabhakar Reddy, Advocates
Anantapuramu, Cell:9980024335.

ప్రతి ఒక్కరికీ మంచి చేసేందుకే 'జగనన్న సురక్ష' : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత , మేయర్ వశీం

కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మంచి చేయాలన్న సదుద్దేశంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మంగళవారి కాలనీ, బోయ వీధి, రుద్రంపేటలో బుధవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి హయాంలో చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి జన్మభూమి కమిటీలతో ధన దోపిడీకి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. వైసిపి హయాంలో జిల్లా కేంద్రమైన అనంతపురం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి నాయకులు మినీ మ్యానిఫెస్టోతో మరోమారు ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని, వారిని ఎవ్వరూ నమ్మేస్థితిలో లేరని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి, జెసిఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు కొండ్రెడ్డి రాధా, రమాదేవి, లావణ్య, లీలావతి, అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచి పద్మావతి, ఎంపిటిసిలు మహబూబి, నారాయణమ్మ, సైపుల్లాబేగ్, నరేంద్రనాథ్‌రెడ్డి, చంద్రా రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 8, 9వ సచివాలయాలకు సంబంధించి బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో, 10వ సచివాలయానికి సంబంధించి రాజీవ్‌గాంధీ కాలనీలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.శిల్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్ యాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు గౌని లావణ్య, బండి అజయ్, ప్రతాప్, మమత, పి.గోవిందరాజులు, శారద, సంజీవప్ప, శివకుమార్, కొంతం దేవరాజు, గోవిందు, ఫక్రుద్దీన్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ, నడిమిదొడ్డి గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ, ఈఓఆర్‌డి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు బొందలవాడలో 127, నడిమిదొడ్డిలో 524 ధ్రువీకరణ ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మమ్మ, తహశీల్దార్ సురేష్‌బాబు, సిఎస్‌డిటి రాజశేఖర్, ఎంఈఓలు కృష్ణయ్య, నల్లపరెడ్డి, వెలుగు ఎపిఎం తిప్పమ్మ, ఆర్ఐ జ్యోతి రాణి, జెఎ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మీదేవి, హర్ష, వీఆర్వోలు దాదాపీర్, కేశవరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను అడ్డుకుంటాం : సిఐటియు

ప్రజాశక్తి-రాయదుర్గం

గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మల్లికార్జున

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సిఎం జగన్ కళ్యాణదుర్గం పర్యటనను అడ్డుకుంటా మని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం ఔట్‌సోర్సింగ్ కార్మికులతో కలిసి స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కార్మికుల డిమాండ్లను సిఎం జగన్ తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో 8న సిఎం జగన్ పర్యటనను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చ రించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, సిద్ధ, మల్లేష్, విజయ్, నాగరాజు, సిఐటియు నాయకులు బంగి శివ, మధు, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

కరోనా సమయంలో సేవలందించిన మున్సిపల్ తాత్కాలిక పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన మూడో రోజు కూడా కొనసాగింది. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద బుధవారం కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో పనిచేసిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకొని ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.శిల్ప, మాజీ ఛైర్మన్ ఉపేందర్‌రెడ్డి శిబిరం వద్దకు చేరుకొని కార్మికులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అవసరమైతే మున్సిపల్ మంత్రితో మాట్లాడి మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంపునకు కృషి చేస్తామని తెలిపారు.

గుత్తి మీదుగా రైళ్లను నడపాలని ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

రద్దయిన, దారి మళ్లించిన రైళ్లను గుత్తి రైల్వే జంక్షన్ గుండా నడపాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో బుధవారం రైళ్ల పరిరక్షణ జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద టికెట్ బుకింగ్ కార్యాలయం ఎదుట నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా నాయకులు కెఎం. రంగనాయకులు, జిఎం బాషా మాట్లాడుతూ మూడేళ్లుగా గుత్తి రైల్వే జంక్షన్ మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లను గుంతకల్లు మీదుగా నడుపుడంతో పాటు అనేక రైళ్లను రద్దు చేశారని తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు రైలు ప్రయాణం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున రైల్వే ఉన్నతాధికారులు స్పందించి గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా రైళ్లను మళ్లించాలని కోరారు. అనంతరం స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, నాయకులు నిర్మలారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు మహమ్మద్, వీరా, బాబు, లింగారెడ్డి, తిరుమలరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం ఏర్పాటుకు స్థలం కేటాయింపు

గుత్తి : మండల పరిధిలోని కొత్తపేట గ్రామ సమీపంలో మ్యూజియం ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు తీర్మానం చేశామని సర్పంచి ఆర్.గురుమస్తాన్ తెలిపారు. ఈ మేరకు తీర్మానం లేఖను బుధవారం ఆయన తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ చారిత్రక గుత్తి కోట కింద తమ గ్రామ పరిధిలో మ్యూజియం ఏర్పాటు చేసేందుకు 0.57 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, వీఆర్వో బాలరాజు, సర్వేయర్ సాయి పాల్గొన్నారు.

వైభవంగా భీమలింగేశ్వరస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-ఉరవకొండ

భక్తజనం మధ్య రథోత్సవం

విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ గ్రామంలో వెలసిన భీమలింగేశ్వరస్వామి రథోత్సవం బుధవారం అశేష భక్తజన సందోహం మధ్య వైభవంగా జరిగింది. ఉదయం ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథాన్ని గ్రామ పురవీధుల గుండా లాగారు. రథోత్సవాన్ని తిలకించడా నికి మండల పరిధిలోని గ్రామాలతో పాటు, కర్నూలు జిల్లా, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడి తీర్చుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉరవకొండ రూరల్ సిఐ శేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించా రు. పూజా కార్యక్రమాల్లో ఎంపిపి కరణం పుష్పావతి, సర్పంచి సుశీల ఉమాశంకర్, ఆలూరు దేవరగట్టు మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, జడ్పిటిసి హనుమంతు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బసన్న, ఎంపిటిసి ఓబులేసు, నాయకులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, ఉప సర్పంచి పార్వతి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అనంతపురం : విద్యార్థులు చైతన్యవంతులై డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ సూచించారు. నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో బుధవారం రసూల్ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు మత్తు(డ్రగ్స్) పదార్థాల వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ సాంబ, అశోక్, ప్రత్యూష, నిషా, భవ్య, జ్ఞానేష్, బాలు, నారాయణస్వామి, మోహన్, అభి, సుచిత్ర, ప్రీతి, నిఖిత, జ్ఞానాంబిక, నరేంద్ర, శివ, సుష్మ, మైత్రి, తేజ, తదితరులు పాల్గొన్నారు.

జెఎఒగా విన్సెంట్ కుమార్

గుత్తి : ఎపి ఎస్పిడిసిఎల్ ఈఈ కార్యాలయంలో నూతన జూనియర్ అకౌంట్స్ అధికారిగా వి.ఎం.విన్సెంట్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంతకల్లు నుంచి బదిలీపై గుత్తికి వచ్చారు. నూతన జూనియర్ అకౌంట్స్ అధికారికి పలువురు అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికి పూలమాలలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎపిఎస్పిడిసిఎల్ పామిడి ఎఇ కె.మధుసూదన్‌రావు, గుత్తి లైన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ తప్పిన విద్యార్థులకు శుభవార్త

గార్లదిన్నె : పది, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయి 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న విద్యార్థులు తిరిగి అదే తరగతిలో వారు చదువుకున్న పాఠశాలలోనే చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంఇఒలు తారా చంద్రనాయక్, వెంకటరమణ బుధవారం తెలిపారు. వీరికి రెగ్యులర్ విద్యార్థుల లాగానే పాఠశాలల్లో అన్ని ప్రయోజనాలు కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడించిన టిడిపి నాయకులు

ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉరవకొండలో గతంలో ఎన్నడూ లేని విధంగా పది రోజులకు ఓ సారి తాగునీరు సరఫరా అవుతుందని, తద్వారా పట్టణ ప్రజలు నీటి సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నిధులు, నీరు సమృద్ధిగా ఉన్నా తాగునీటిని ప్రజలకు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని మండిపడ్డారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో నీటి సమస్యపై చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పురుషోత్తం, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, ఉపాధ్యక్షులు రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాంబాబు, మాజీ సర్పంచులు వెంకటేశులు, ఓబులేసు, నాయకులు రామాంజనేయులు, వరప్రసాద్, బోస్, సుధాకర్, గోవిందు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కులో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

పార్కును సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో పాత బ్రిడ్జి దగ్గర నూతనంగా నిర్మిస్తున్న పార్కును బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సందర్శించి జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్క్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ నెల 8వ తేదీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి పురస్కరించుకుని ఈ పార్కును ప్రారంభించి, అందులో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించనున్నారు. ఎమ్మెల్యే వెంట వెంకటరెడ్డిపల్లి పుల్లారెడ్డి, ఆలూరు రామేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నార్పల పిహెచ్‌సికి కొత్త 108

నార్పల : స్థానిక ప్రాథమిక వైద్యశాల(పిహెచ్‌సి)కు నూతన 108 వాహనం మంజూరు కావడంతో బుధవా రం జిల్లా మేనేజర్ సంజీవరెడ్డి, డిఎఫ్ఎం యుగంధర్ లాంఛనంగా ప్రారంభించారు. ఇటీవల సిఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 300 నూతన 108 వాహనాలను మంజూరు చేయగా అందులో నార్పలకు కేటాయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు సాదియా, ప్రవీణ్, నార్పల 108 స్టాఫ్ టెక్నీషియన్ విజయ్, యుగంధర్, పైలెట్ రాజశేఖర్, ఎస్సీ సెల్ రామయ్య, సూపర్‌వైజర్ అక్కులప్ప, రామలింగ పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి

రాయదుర్గం రూరల్ : ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను అందుబాటు లో ఉంచాలని ఎడిఎ లక్ష్మానాయక్ సూచించారు. మండల పరిధిలోని 74-ఉడేగోళం ఆర్‌బికెలో బుధవారం ఆయన ఐదు మండలాల ఆర్‌బికె సిబ్బంది, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పిఎం కిసాన్ ఈకేవైసి పూర్తి చేయడంతో పాటు పంట సాగు వివరాలను అందజేయాలన్నారు. ప్రతి రైతు పొలాన్ని తనిఖీ చేసి ఈ పంట నమోదు చేసేందుకు సమాయత్తం కావాలన్నారు.

నేడు పశువులకు ఉచిత టీకాలు

నార్పల : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6వ తేదీ(నేడు) నుంచి లేగ దూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకా, కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలను నార్పల, బి.పప్పూరు పశు వైద్యశాలలో ఉచితంగా వేయనున్నట్లు డాక్టర్ గోవిందరాజులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనోసిస్ వ్యాధులు అనగా పశువుల నుంచి మనిషికి, మనిషి నుంచి పశువులకు సంక్రమించే వ్యాధులు అన్నారు. కావున 4 నెలల నుంచి 8 నెలల ఆడ లేగదూడలకు బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకా, కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను ఈ నెల 20వ తేదీ వరకూ ప్రతి గ్రామంలో వేస్తారన్నారు.

రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

పోలీస్ స్టేషన్ ముందు మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేశవ్

సాగు చేసి నష్టపోయిన అన్ని రకాల పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని రోడ్డెక్కిన రైతులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని పిఏసి ఛైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నుంచి పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామిలతో మాట్లాడుతూ రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల పోలీసుల తీరు సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చీనీ, పత్తి పంటలకు మాత్రమే బీమా ప్రకటించడం వల్ల అన్యాయం జరిగిందని, నష్టపోయిన అన్ని రకాల పంటలకు బీమా వర్తింపచేయాలని రైతులు శాంతియుతంగా నిరసన తెలపగా పోలీసులు అధికార పార్టీ కొమ్ముకాస్తూ అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. అక్రమ కేసులను వెంటనే తొలగించకపోతే సోమవారం నుంచి పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి గోవిందు, పురుషోత్తం, మారెన్న, సుంకమ్మ, వెంకటేసులు, ఓబులేసు, చాబాల ఎర్రిస్వామి, రాంబాబు, ఖలందర్, రహంతుల్లా, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మౌలిక సదుపాయాలు కరువు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సిద్దరాంపురం సచివాలయం

మండల పరిధిలోని పలు సచివాలయాలకు విద్యుత్, ఇంటర్నెట్, తదితర కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మండలంలో 19 సచివాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు ఉద్యోగులను నియమించారు. అయితే చాలా సచివాలయాల్లో మౌలిక సదుపాయాలైన విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం శోచనీయం. నాలుగు సచివాలయాల్లో విద్యుత్, వెంటిలేషన్, ఇంటర్నెట్, ఇంటిలిజెంట్ డోర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. సచివాలయాల ద్వారా 9 నెలలైనా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రస్తుతం 'జగనన్న సురక్ష' పేరుతో సచివాలయాల్లో 11 రకాల సేవలను ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే ఇంటర్నెట్ సౌకర్యం లేకపోతే ప్రజలకు సేవలు ఎలా అందిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే సచివాలయాలకు అటెండర్ గానీ, స్వీపర్‌ను గానీ నియమించలేదు. దీంతో సచివాలయా ల ప్రాంగణాల్లో అపరిశుభ్రత నెలకొంది. మిగిలిన 5 సచివాలయాల పరిధిలో కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

సిఎం సభను విజయవంతం చేయండి : మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-బెళుగుప్ప

సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 8వ తేదీ సిఎం జగన్ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం మాజీ సర్పంచి రామేశ్వరరెడ్డి నివాసంలో విశ్వేశ్వరరెడ్డి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి పెద్దన్న త్రిలోకనాథ్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ ఈ నెల 8న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా కళ్యాణదుర్గంలో నిర్వహించే రైతు దినోత్సవ కార్యక్రమంలో సిఎం జగన్ ఖరీఫ్-2022 వాతావరణ బీమా విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, నాయకులు పాటిల్ నాగిరెడ్డి, ఆవులెన్న సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల బీమా కోసం టిడిపి ధర్నా

ప్రజాశక్తి-ఆత్మకూరు

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పంటల బీమాలో రైతులకు అన్యాయం జరిగిందని, నష్టపోయిన పంటల న్నింటికీ బీమా వర్తింపచేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించి, అనంతరం స్థానిక ఆర్‌బికె వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి, చీనీ పంటలకు మాత్రమే బీమా ప్రకటించడంతో ఇతర పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అప్పు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయగా ప్రకృతి వైపరీత్యాల వల్ల సరైన దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున గ్రామస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వ్యవసాయ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. రైతులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు అధికారం కోల్పోవడం ఖాయమన్నారు. అనంతరం ఎఒ సుచరితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముట్టాల శ్రీనివాసులు, కృష్ణమోహన్ చౌదరి, బాలు, రాజా రమేష్, మంగలి ఆనంద్, బొమ్మయ్య, అక్కులన్న, బాబా, మారెక్క, పద్మావతి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్‌కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-అనంతపురం

పారా మెడికల్ కోర్సులు చేసిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డా॥అబ్దుల్ రజాక్ గఫూర్ తెలిపారు. ఆయన బుధవారం నగరంలో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసి న వారు వైద్య రంగంలో వైద్యుడితో సమానంగా వైద్య సేవలు అందించవచ్చు అన్నారు. ఆధునిక సమాజంలో పారా మెడికల్ సిబ్బందికి మంచి డిమాండ్ ఉందన్నారు. డిప్లొమా ల్యాబ్ టెక్నీషియన్, ఆప్తమాలిక్ అసిస్టెంట్, డయాలసిస్ టెక్నీషియన్, ఆపరేషన్ థియేటర్ మేనేజ్‌మెంట్ టెక్నీషియన్, తదితర 18 రకాల కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఇందులో చేరవచ్చన్నారు. నగరంలోని డా. కెఎస్ఆర్ గఫూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ గుర్తింపు పొందిన కళాశాల అని, ఇందులో చేరిన వారికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. వివరాలకు 94400 63212 సంప్రదించాలన్నారు.

ప్రభుత్వాసుపత్రికి 'మార్క్' ఆధ్వర్యంలో ఫ్యాన్ల వితరణ

ఫ్యాన్లను అందజేస్తున్న డాక్టర్ అమర్ మహేష్

అనంతపురం : నగరంలోని సాయి నగర్‌లో ఉన్న 'మార్క్' గుండె ఆసుపత్రి యాజమాన్యం బుధవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సీలింగ్ ఫ్యాన్లను అందజేసింది. మార్క్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ అమర్ మహేష్ 20 సీలింగ్ ఫ్యాన్లను సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ దాతలు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మార్క్ ఆసుపత్రి, జిజిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుత్తి : పట్టణంలోని మన్రో సత్రం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండల పరిధిలోని బసినేపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు శ్రీరాములు ద్విచక్ర వాహనంపై గుత్తికి వస్తూ ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి చేతి వేళ్లు తెగి తీవ్రంగాపడడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదనపు చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండల పరిధిలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన చిన్న కామక్క బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల వివరాల మేరకు.. కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన ఆమె నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.